WWW.EPAPER.MAHAADAILY.COM
Follow: @ANNTELUGU

# మహా పత్రిక
## నిజామాబాద్
## కామారెడ్డి

01-11-2024 | శుక్రవారం, హైదరాబాద్







## ట్రాఫిక్ గాలికి.. వసూళ్లకు పరుగులు..

- నగరంలో ఎక్కడికక్కడే నిలుస్తున్న ట్రాఫిక్
- సమస్య పరిష్కారంపై ట్రాఫిక్ పోలీసుల దృష్టేది?

02

# కల్లాలు దాటని ధాన్యం

- రహదారులపైనే లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యపు రాశులు
- కొనుగోళ్లపై సర్కారు నిర్లక్ష్యం
- నామమాత్రంగా కొనుగోలు కేంద్రాల ప్రారంభం
- కాంటా వేసింది లేదు.. గింజ కొన్నదీ లేదు



**వానకాలం వడ్లు కాంటా పడడం లేదు. కల్లాలు దాటడం లేదు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభానికి మాత్రమే పరిమితమయ్యాయి. వడ్ల సేకరణ మొదలు కాకపోవడంతో ఏ రోడ్డు మీద చూసినా ధాన్యం రాశులే దర్శనమిస్తున్నాయి. పుట్ల కొద్దీ వడ్లతో రహదారులన్నీ నిండిపోయాయి. పదిహేను రోజుల నుంచి కల్లాలు, రోడ్లపైనే ధాన్యం కుప్పలు ఉంటున్నా.. సేకరణ ప్రక్రియపై సర్కారు నుంచి స్పష్టత కరువైంది. దీంతో ఉమ్మడి జిల్లాలోని రైతులకు పడిగాపులతోపాటు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వం చెబుతున్న మాటలకు.. క్షేత్రస్థాయిలో చేతలకు పొంతనలేకుండా పోయిందంటూ రైతాంగం అసహనం వ్యక్తం చేస్తున్నది.**

**- మహా, నిజామాబాద్**

ప్రతిరోజూ వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు మార్కెట్‌కు వస్తున్నాయి. కొనుగోలు కేంద్రాలకు పుట్ల కొద్దీ ధాన్యం తరలిస్తున్నా..కొనేవారు కరువయ్యారు. దళారులు, వ్యాపారులను మినహాయిస్తే .. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సేకరణపై ఎలాంటి స్పష్టత లేకుండా పోయింది. ధాన్యం కుప్పలను అకాల వర్షాలకు తడవకుండా చూసుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ఏ వాన వచ్చి నష్టాన్ని తీసుకు వస్తుందో అన్న భయంతో బిక్కుబిక్కుమంటున్నారు. వందలాది కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ఉమ్మడి జిల్లాలో యంత్రాంగం ప్రణాళికలు సిద్ధం చేసింది. 18లక్షల మెట్రిక్ టన్నులు దిగుబడులు వస్తాయని అంచనా వేసింది. కానీ ఇంతవరకూ కొనుగోళ్ల ప్రక్రియంలో వేగం పుంజుకోకపోవడం గమనార్హం. సర్కారు నిర్లక్ష్యం మూలంగా రైతులు ఎదురుచూపులకు చెక్ పెట్టి దళారులు, వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఎంతో కొంతకు ముట్టజెప్పి అదే పదివేలు అన్నట్లుగా స్వల్ప గిట్టుబాటుతోనే మిన్నకుండిపోతున్నారు.

మిగతా 2లో



ఇంటి ముందు ముగ్గువేస్తున్న వారిపైకి

## దూసుకెళ్లిన కారు.. ఇద్దరికి తీవ్ర గాయాలు..

**మహా, మధ్యప్రదేశ్ :**

మధ్యప్రదేశ్ రాష్ట్రంలో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. ఇండోర్‌లో ఓ కారు బీభత్సం సృష్టించింది. ఇంటి ముందు ముగ్గు వేస్తున్న ఓ బాలిక, మహిళపైకి దూసుకెళ్లింది. సోమవారం ఉదయం రద్దీగా ఉన్న ఓ వీధిలో ఇంటి ముందు 14 ఏళ్ల బాలిక, 21 ఏళ్ల మహిళ ముగ్గు వేస్తున్నారు. ఆ సమయంలో అతి వేగంగా వచ్చిన కారు.. అదుపుతప్పి వీరిపైకి దూసుకెళ్లింది. ఈ ఘటన అనంతరం డ్రైవర్ కారును అక్కడే వదిలేసి పరారయ్యాడు. ఈ ప్రమాదంలో బాలిక, మహిళకు తీవ్ర గాయాలైనట్లు తెలిసింది.




## ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి..

### జీడిమెట్లలో ఘటన

**మహా, హైదరాబాద్ :** ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ విషాదకర సంఘటన జీడిమెట్ల పరిధి షాపూర్‌నగర్ చౌరస్తాలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రహదారి దాటుతున్న వ్యక్తిని వేగంగా వచ్చిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు పాదచారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సదరు వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు.



# పండుగపూట విషాదం..

### హై టెన్షన్ వైర్ తగిలి బాలుడికి తీవ్ర గాయాలు

**మహా, హైదరాబాద్ :**

వెలుగులు నింపాల్సిన దీపావళి పండుగ వారి కుటుంబంలో చీకట్లను మిగిల్చింది. దీపాల పండుగను ఎంతో ఘనంగా జరుపుకోవాలని ఆశపడ్డ వారికి తీవ్ర నిరాశే మిగిలింది. వివరాల్లోకి వెళ్తే.. దీపావళి పండగ సందర్భంగా లైటింగ్ ఏర్పాటు చేస్తుండగా, ఇంటి పైనుంచి వెళ్తున్న హై టెన్షన్ వైర్ తగిలి బాలుడి శరీరం పూర్తిగా కాలిపోయింది. ఈ విషాదకర సంఘటన అంబర్‌పేటలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దీపావళి పండగ సందర్భంగా లైటింగ్ ఏర్పాటు చేస్తుండగా, ఇంటి పైనుంచి వెళ్తున్న హై టెన్షన్ వైర్ తగిలి అభి(14) అనే బాలుడి శరీరం పూర్తిగా కాలిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాలుడిని చికిత్స నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. కాగా, అభి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# కుల గణన కోసం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేస్తాం: మంత్రి పొన్నం



**మహా, హైదరాబాద్ :**

కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో భాగంగా రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు.. దేశంలో మొదటిసారి సమగ్ర కుల గణన ప్రక్రియ ఈనెల 6 వ తేదిన ప్రారంభమవుతుందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బుధవారం ఆయన గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. సమగ్ర సర్వే సక్రమంగా జరిగి భవిష్యత్‌లో అందరికి సమ న్యాయం జరిగేలా అందరు సహకరించాలన్నారు. దీనికి సంబంధించి త్వరలో అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయిలో ఉన్న కాంగ్రెస్ నాయకులు కూడా గ్రామీణ ప్రాంతాలలో అధికారులకు సహకరించాలని సూచించారు. 150 ఇళ్లకు అధికారుల బృందం సమగ్ర సమాచార సేకరణ చేపడుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు అన్ని రకాలుగా అందుబాటులో ఉండాలన్నారు.